క్లుప్తంగా

నేరెళ్ల పీహెచ్‌సీలో కేంద్ర బృందం


నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

తంగళ్లపల్లి: మండలంలోని నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్వాస్) బృందం సందర్శించారు. కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ పునీత్ష, డాక్టర్ సీమ నేరెళ్ల పీహెచ్‌సీని పరిశీలించారు. డీఎంహెచ్‌వో కె.సుమన్ మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు రజిత, శ్రీరాములు, మెడికల్ ఆఫీసర్ జిందం రేఖ, డీపీవో ఉమ, సాగర్ ఉన్నారు.

శ్రీనగర్ కాలనీకి వరద నీటి తంటా


పీహెచ్‌సీ సిబ్బందితో కేంద్ర అధికారుల బృందం

సిరిసిల్ల: పట్టణంలోని శ్రీనగర్ కాలనీ ఏటా వర్షాకాలంలో వరద నీటి కష్టాలను ఎదుర్కొంటోంది. భారీ వర్షాల కారణంగా పైనుంచి వస్తున్న వరద, కొత్త చెరువు మిగులు జలాలు, సిరిసిల్ల పట్టణంలోని మురికి కాల్వల నీరు ఈ కాలనీని ముంచెత్తుతోంది. మున్సిపల్ అధికారులు తవ్విన కచ్చా కాల్వ నించి నీరు వీధుల్లోకి వస్తోందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం నిరసన తెలిపారు. ఇళ్ల ఎదుటే మురికి నీరు నిలుస్తోందని, తాము బయటకు వచ్చే పరిస్థితి లేదని వాపోయారు. మున్సిపల్ అధికారులు కాల్వను మళ్లించేందుకు జేసీబీతో రాగా అసలు ఆ కాలువనే పూడ్చివేయాలని, మురుగు నీరు రా కుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెచ్చులూడుతున్న భవనాల్లో హాస్టళ్లు


పెచ్చులూడుతున్న భవనం

సిరిసిల్లటౌన్: జిల్లాలో శిథిలావస్థలో ఉన్న భవనాల్లో బీసీ సంక్షేమ హాస్టళ్లు నడిపిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు అంగూరి రంజిత్ విమర్శించారు. పట్టణంలోని హాస్టళ్లను గురువారం సందర్శించి మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఉన్న హాస్టళ్లలో సమస్యలు పేరుకుపోయాయన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు అందించాలని, నాణ్యమైన భోజనం పెట్టాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రసాద్, రాకేశ్ తదితరులున్నారు.


కచ్చా కాలువ నుంచి నీటి లీకేజీ కారణంగా జలమయమైన రహదారి


వడ్రంగి కార్ఖానాలోకి చేరిన వరదనీరు


రహదారిపై చేరిన మోకాలి లోతు నీళ్లు


ఆందోళన చెందుతున్న శాంతినగర్ కాలనీ మహిళలు

లోపించిన ముందుచూపు

వరద నీటి ముప్పుపై ముందు జాగ్రత్తలు తీసుకోలేని మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యం సిరిసిల్ల వాసులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న నిరంతర వర్షాలు శివారు ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. ప్రధానంగా కొత్త చెరువు కింద ఉన్న శాంతినగర్, శ్రీనగర్‌కాలనీ, ఆటోనగర్ ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. వరద నీటి పారుదల కోసం తవ్విన కచ్చా కాలువల నుంచి వరద నీరు రోడ్ల పైకి వస్తోంది. నివాస స్థలాల మధ్య భారీగా నీటి నిల్వలు పెరిగి అంటువ్యాధుల విస్తరణకు కారణమవుతున్నాయి. సమీప ప్రాంతాల్లో చేతి వృత్తుల వారి కార్ఖానాల్లోకి వరద నీరు చేరి ఉపాధిమార్గాలను దెబ్బతీసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల


నివాస స్థలాల మధ్య నిలువ ఉన్న వరద నీరు

రోడ్డు బాగు చేయాలని నిరసన ప్రదర్శన


నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిందని, గుంతలను వెంటనే పూడ్చివేయాలని బీజేపీ నాయకులు గురువారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఎమ్మెల్యే చిత్రపటం పట్టుకున్న వ్యక్తికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు, ఇతర గ్రామాల్లో కూడా రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిందని, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్న కూడా ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. రోడ్లకు మరమ్మతులు చేసేంత వరకు పోరాటం చేస్తామని, బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధి చేసి చూపించాలని, మాటలు చెప్పుడుకాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్, స్వామి, హరీశ్, అనీల్, ప్రశాంత్, సంపత్, ముత్తక్క, శ్రీనివాస్, కృష్ణ, రాజారెడ్డి, రమేశ్, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'అధికారులను బెదిరించడం సరికాదు'


మాట్లాడుతున్న నాయకులు

ఇల్లంతకుంట: మండలంలో కొందరు వ్యక్తులు దళిత సంఘాల జిల్లా నాయకులమని చెలామణి అవుతూ అధికారులు, ప్రజాప్రతినిధులను బెదిరింపులకు గురిచేస్తున్నారని మండల దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఇల్లంతకుంటలోని అంబేడ్కర్ సర్కిల్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వారు చేస్తున్న అక్రమ దందాకు అడ్డు పడ్డారనే అక్కసుతో పద్ధతి మార్చుకోవాలని చెప్పిన అధికారులపై జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేస్తున్న వారిని మండల ప్రజలు నమ్మొద్దని కోరారు. దమ్మని లక్ష్మణ్, కడగండ్ల తిరుపతి, పసుల వెంకటి, ర్యాగటి రమేశ్, పట్నం శ్రీనివాస్, పట్నం మహేందర్, రాజయ్య, రమేశ్, హరీష్, ప్రభాకర్, రాజేశం, రమేశ్, రాములు ఉన్నారు.

పంట చేలలో నీరు నిల్వకుండా చూసుకోవాలి


పంటల నమోదు పరిశీలనలో డీఏవో భాస్కర్

బోయినపల్లి: వర్షాలు కురుస్తున్న క్రమంలో రైతులు తమ పంట చేలలో నీరు నిల్వకుండా, కాల్వల ద్వారా బయటకు పంపాలని డీఏవో భాస్కర్ సూచించారు. మండలంలోని కోరెం, బోయినపల్లి గ్రామాల్లో పంటల నమోదు ప్రక్రియను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా 15 సర్వే నంబర్లకు సంబంధించిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంటలకు మోగి పురుగు సోకితే లింగాకర్షక బుట్టలు తయారు చేసుకోవాలని తెలిపారు. అలాగే కూరగాయల తోటలు, ఆయిల్‌పామ్ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి తెలియ చెప్పారు. మొసాయిక్ వైరస్ సోకిన పంటలకు సంబంధించిన ఆకులను తుంచి కాలబెట్టాలని కోరారు. ఆయన వెంట ఏఈవో శ్రీదేవి, రైతులు ఉన్నారు.

ఆర్టీసీ చైర్మన్‌ను కలిసిన శాంతినగర్ గ్రామ పెద్దలు


ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌తో గ్రామస్తులు

వీర్నపల్లి: మండలంలోని శాంతినగర్ గ్రామ పెద్దలు గురువారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌ను నిజామాబాద్‌లోని తన నివాసంలో కలిశారు. రెండు జిల్లాల సరిహద్దులో ఉన్న తమకు పోడు భూముల సమస్యలు పరిష్కరించి పోడు హక్కు పత్రాలు అందేలా చూడాలని సర్పంచ్ మల్లేశం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, విఠల్ కోరారు.

సీడ్ బాల్స్ పంపిణీ


విద్యార్థులు తయారు చేసిన సీడ్‌బాల్స్ పంపిణీ చేస్తున్న సమ్మయ్య

సిరిసిల్లటౌన్: స్థానిక విజ్ఞానవర్ధిని హైస్కూల్ విద్యార్థులు తయారు చేసిన 30 వేల వివిధ రకాల మొక్కల సీడ్‌బాల్స్‌ను మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య వారి తల్లిదండ్రులకు గురువారం అందించారు. విద్యార్థుల్లో పర్యావరణ హితంపై జిజ్ఞాస ఉండటం అభినందనీయమన్నారు. వర్షాకాలంలో మొక్కలు పెంచి వాటిని సంరక్షించాలని కోరారు. ప్రిన్సిపాల్‌లింబాద్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోచమ్మకు బోనాలు



ఇల్లంతకుంట: మండలంలోని రేపాక యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ బోనాలు చేశారు. మహిళలు నెత్తిన బోనాలెత్తుకుని, శివసత్తుల పూనకాలతో డోలు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పోడుసాగుకు పట్టాలివ్వాలి


ఏవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: పోడుభూముల సాగుదారులందరికీ ప్రభుత్వం పట్టాలివ్వాల్సిందేనని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. పోడు సాగుదారులకు న్యాయం చేయాలంటూ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. వేణు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 5 వేల మంది పోడుభూములను దశాబ్దాలుగా సాగు చేస్తుంటే ప్రభుత్వం 1600 మందికే పట్టాలివ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులందరికీ వెంటనే పోడుపట్టాలు ఇవ్వాలని కోరారు. ఈమేరకు కలెక్టరేట్ ఏవో గంగయ్యకు వినతిపత్రం అందించారు. పంతం రవి, మంత్రి చంద్రయ్య పాల్గొన్నారు.

బూత్ కమిటీ సమావేశాలు


వార్డు సభల్లో మాట్లాడుతున్న జిందం చక్రపాణి

సిరిసిల్లటౌన్: స్థానిక 39వ వార్డులో బీఆర్ఎస్ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. కొత్తగా ఎన్నికైన బూత్ కమిటీ ప్రతినిధులకు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి నియామకపత్రాలను అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, బొల్లి రామ్మోహన్, బత్తుల వనజ, కౌన్సిలర్ ఆకుల కృష్ణ పాల్గొన్నారు.



వినూత్న నిరసనలు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి/ముస్తాబాద్/చందుర్తి/ఇల్లంతకుంట: పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 15వ రోజుకు చేరింది. , తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతూ వీర్నపల్లి మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు ఒంటికాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేయగా, ఎల్లారెడ్డిపేటలో అర్ధనగ్న ప్రదర్శన, చందుర్తిలో భిక్షాటన చేస్తూ, బోయినపల్లిలో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు.

పోయిన సెల్‌ఫోన్ అప్పగింత

గంభీరావుపేట: మండల కేంద్రానికి చెందిన పిట్ల సత్యనారాయణకు చెందిన సెల్‌ఫోన్ ఇటీవల పోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ఫోన్ ఆచూకీ కనుగొని గురువారం ఎస్సై మహేశ్ బాధితుడికి అప్పగించారు.

మత్తడి పోస్తున్న చెక్‌డ్యామ్

ముస్తాబాద్: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటల్లోకి భారీగా వరద నీరు చేరుతోంది. సేవాలాల్‌తండాలో నక్కవాగు ప్రవాహం మొదలైంది. ఆవునూర్, రామలక్ష్మణపల్లెలో మానేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్ మత్తడి పోస్తోంది. ప్రజలు అప్రమత్తంగా వుండాలని తహసీల్దార్ మునిందర్ కోరారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా వుండాలన్నారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణ

గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట: ఎన్నికల నిర్వహణపై బీఎల్‌వోలకు గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశాల్లో ఫొటో ఎలక్ట్రోరోల్స్, ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. తహసీల్దార్లు మధుసుదన్‌రెడ్డి, జయంత్‌కుమార్, తాఫాజుల్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన సెస్ ఏఈలు


గంభీరావుపేట: సన్మానిస్తున్న సెస్ డైరెక్టర్


రుద్రంగి ఏఈ మహేశ్‌ని సన్మానిస్తున్న సెస్ డైరెక్టర్

వేములవాడ: వేములవాడ టౌన్ సెస్ ఏఈగా సిద్ధార్థ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల బదిలీ కావడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సెస్ సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఇప్పటి వరకు ఏఈగా పనిచేసిన సుష్మ సిరిసిల్ల కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ తిరుపతిబాబు, నాగిరెడ్డి, శ్రీనివాస్, లైన్‌మెన్లు అశోక్, లక్ష్మణ్, జనార్దన్, తిరుపతి పాల్గొన్నారు.

రుద్రంగి సెస్ ఏఈగా మహేశ్

రుద్రంగి: సెస్ ఏఈగా మహేశ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు రుద్రంగి సెస్ ఏఈగా విధులు నిర్వహించిన రాకేశ్ రెడ్డి ఇల్లంతకుంటకు బదిలీపై వెళ్ళగా ముస్తాబాద్ సెస్ ఏఈగా విధులు నిర్వహించిన మహేశ్ రుద్రంగికి బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. బాధ్యతలు స్వీకరించిన మహేశ్‌కు రుద్రంగి సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం శాలువా కప్పి స్వాగతం పలికారు.

బోయినపల్లి సెస్ ఏఏఈగా ప్రశాంత్

బోయినపల్లి: మండల సెస్ ఏఏఈగా గాడెపాక ప్రశాంత్ విధుల్లో చేరారు. ఇంతకుముందు ఇక్కడ ఏఏఈగా పని చేసిన రంగు నగేశ్ వేములవాడ రూరల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, ఏఈ రంగు నగేశ్, లైన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, నాయకులు మిట్టపల్లి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

చందుర్తి సెస్ ఏఈగా మహేశ్ బాధ్యతలు

చందుర్తి: సెస్ ఏఈగా మహేశ్ గురువారం బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ సెస్ ఏఈగా పని చేస్తున్న రాకేశ్‌రెడ్డి ఇల్లంతకుంట మండలానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో ముస్తాబాద్ ఏఈగా పని చేస్తున్న మహేశ్ చందుర్తి ఏఈగా బదిలీ వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఏఈ మహేశ్‌ను సెస్ డైరెక్టర్ పోన్నాల శ్రీనివాస్‌రావు, చందుర్తి సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్ శాలువాలతో సన్మానించారు.

సెస్ ఏఈగా రిషిక

గంభీరావుపేట: మండల సెస్ ఏఈగా రిషిక ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. వేములవాడ నుంచి రిషిక ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సెస్ డైరెక్టర్ నారాయణరావు సన్మానించారు.

రోడ్డు విస్తరణ పనులు షురూ

గంభీరావుపేట: మండల కేంద్రంలో రోడ్డు విస్తరణకు ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు పర్యవేక్షణలో గురువారం భవనాల కూల్చివేత పనులు మొదలయ్యాయి. గ్రామపంచాయతీ 80 ఫీట్లకు తీర్మానం చేసినట్లు, దాటి ఉన్న భవన, ఇళ్ల యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సర్పంచ్ కోరారు.

రెడ్డి సంఘం మండల అధ్యక్షుడికి సన్మానం



ముస్తాబాద్: రెడ్డి సంఘం మండలాధ్యక్షుడిగా ఎన్నికైన కుంబాల మల్లారెడ్డిని గురువారం పలువురు ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఎంపీపీ శరత్ రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, జానబాయి, యాదగిరి, కొండ శ్రీనివాస్, సావిత్రి, భాగ్య పాల్గొన్నారు.

పోతుగల్‌కు ఆర్టీసీ బస్ సర్వీస్



ముస్తాబాద్: మండలం పోతుగల్, ముస్తాబాద్ ఆర్టీసీ బస్ సర్వీసును గురువారం ప్రారంభించారు. బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్, డిపో కంట్రోలర్ రెడ్డినాయక్, పారిపెల్లి శ్రీనివాస్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

మసీదుల విద్యుత్ బిల్లులు మాఫీ చేయాలి


సెస్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: జిల్లాలోని మసీదులలో పాత విద్యుత్ బిల్లుల బకాయిలను పూర్తిగా మాఫీ చేయాలని జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా గురువారం సెస్ చైర్మన్ చిక్కాల రామారావుకు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలోని మసీదులలో ఎలాంటి ఆర్థిక వనరులు లేకపోవడంతో మసీదుల నిర్వహణలో ముస్లింలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చందాలు వేసుకోని మసీదులలో ప్రార్థనలు చేసుకుంటున్నామన్నారు. పాత కరెంట్ బిల్లులు కట్టుకోలేని పరిస్థితి ఉన్నందున పాత బకాయిలు ఉండిపోయాయన్నారు. ప్రస్తుతం ప్రతినెల బిల్లులను కట్టుకోవడం జరుగుతుందని, పాత బకాయిలు రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు జబ్బర్, ముస్లిం నాయకులు షేక్ షాదుల్లా, ఇర్ఫాన్, ఉస్మాన్, హసన్, ఫున్నులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాడాలి


మాట్లాడుతున్న కంచర్ల రవిగౌడ్

సిరిసిల్లఅర్బన్: విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ కోరారు. బీసీ విద్యార్థి సంఘంలో గురువారం పలువురు విద్యార్థులు చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. రవిగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై పోరాడాలని కోరారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. విద్యార్థి సంఘం నాయకులు సుజిత్, నవీన్, రాజశేఖర్, యాదగిరి, అభిషేక్, వినయ్, రామ్‌సాయి, రామ్‌చరణ్, నవీన్, మల్లేశ్ ఉన్నారు.

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

వేములవాడఅర్బన్: తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులకు వేములవాడ ఆర్టీసీ సంస్థ వారు ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 31న అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు వేములవాడ నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు తెలిపారు. సర్వీస్ నంబర్ 7555 గల బస్సు జూలై 30న రాత్రి 8 గంటలకు వేములవాడ నుంచి బయల్దేరి కరీంనగర్ చేరుకుని అక్కడి నుంచి 9 గంటలకు బయల్దేరి వెళ్తున్నట్లు తెలిపారు. వివరాలకు 99592 25926, 7382851826 నంబర్లను సంప్రదించాలని కోరారు.